18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శుక్రవారం | 4 ఏప్రిల్ 2025 | పేజీలు 9

# వైభవంగా కోదండరాముని రథోత్సవం



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి కోదండ రామస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం ఉదయం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 9.15 గంటలకు సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి నాలుగు మాడ వీధుల్లో విహరించారు. డప్పు వాయిద్యాలు, భజన బృందాలు కోలాటాలు ఆడుతుండగా భక్తులు మిగతా 8లో

# నగర పాలక సంస్థ ఆదాయానికి గండి

**సీజ్ చేసిన దుకాణాన్ని దౌర్జన్యంగా తెరచిన వైసీపీ నాయకుడు**

**నగర పాలక సంస్థకు సుమారు 6 లక్షలు ఎగనామం పెట్టిన వైనం**

**పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**

**నాపై చర్యలు తీసుకునేది ఎవరు అనే ధీమాతో ఆ నాయకుడు**

**చిత్తూరు బ్యూరో, మేజర్‌న్యూస్:** గత వైసిపి ప్రభుత్వ హయాంలో చిత్తూరు నగరపాలక సంస్థను తమ



చెప్పుడు చేతుల్లో పెట్టుకున్న ఓ వైసిపి బడా నాయకుడికి చేదోడు వాదోడుగా ఉంటూ చెంచా గిరి చేసిన ఆ పార్టీకి చెందిన ఓ చోట కుర్ర లీడర్ నేటికీ తన అహంకారాన్ని విడవకుండా తన్ను అడ్డుకునే వాడు ఎవరు లేరు అనే ధీమాతో నగరపాలకసంస్థ ఆదాయానికి గండి పెడుతూ దర్జాగా దోచుకొంటూనే ఉన్నాడు. ఈతగాడి వ్యవహారం ఉమ్మడి పార్టీ నాయకులకు తెలిసిన అతగాడిని ఏమి చేయలేక ఉండిపోవడంతో ఈ నాయకుడు ఇప్పటికీ ఇతగాడు నగరపాలక సంస్థ కార్యాలయంలో తిష్ట వేసుకుని తన పనులు తాను చక్కదిద్దు కుంటున్నాడు. స్థానిక గిరింపేట సమీపంలోని పాత కలెక్టర్ కార్యాలయ ఎదుట గల చిత్తూరు నగరపాలకసంస్థ గుర్రప్ప నాయుడు దుకాణాల సముదాయంలో గత ప్రభుత్వ హయాంలో ఓ దుకాణాన్ని తన పేరు మీద తీసుకోవడం జరిగింది. తీసుకున్నప్పటి నుండి నగరపాలక సంస్థకు కట్టవలసిన నెలసరి అద్దెను చెల్లించకుండా ఆ దుకాణాన్ని ఇతరులకు అధిక అద్దెకు ఇవ్వడం జరిగింది. అప్పట్లో నగరపాలక సంస్థ అధికారులు ఎవరైనా అద్దె అడిగితే తాను ఓ బడా నాయకుడి అనుచరుడు అని నన్ను అద్దె అడిగితే మీ అంతు చూస్తానని బెదిరింపులకు గురి చేసేవాడు. దాంతో వారు ఏమి చేయలేక మిన్నకుండి పోయేవారు. ఇతని హవా గత ప్రభుత్వంలో జరిగింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా ఇతని ఆకురాలు అలాగే కొనసాగుతున్న అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అ నాయకుడు నేటికీ అదే దుకాణంలో తన దుకాణాన్ని కొనసాగిస్తూ ఉన్నాడు. ఈ విషయాన్ని ప్రస్తుత నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తెలియడంతో ఆయన ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ నేతృత్వంలో రెవెన్యూ విభాగానికి చెందిన అధికారులు విచారణ చేపట్టడంతో మిగతా 2లో

# ఆశ.. నిరాశ ?

**ఊహల పల్లకిలో.. మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవులు**

**ఛైర్మన్ పదవులకు తేలని రిజర్వేషన్లు**

**రిజర్వేషన్లపై ఎటు తేల్చుకోలేని ప్రజాప్రతినిధులు**

**రిజర్వేషన్లు ఖరారు అయితేనే**

**పేర్లు ప్రతిపాదనలు**

**ఆశావాహులలో అసంతృప్తి...?**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలుత వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవులను సంక్రాంతికి భర్తీ చేస్తామని ప్రకటించారు. అయితే ఛైర్మన్ పదవుల రిజర్వేషన్ ఖరారు కాకపోవడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది. మళ్లీ ఉగాదికి భర్తీ చేస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్తున్నా.. ఛైర్మన్ పదవుల రిజర్వేషన్లపై ప్రజా ప్రతినిధులు ఎటు తేల్చుకోలేక పోతున్నారు. గత ఆదివారం ఉగాది పర్వదినానికి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేస్తుందని అందరూ భావించారు. కానీ ఆ ఉగాది పుణ్యకాలం కూడా గడిచిపోయింది. ఈ నేపథ్యంలో ఛైర్మన్ పదవుల ఆశిస్తున్న ఆశావాహులలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవులను ఆశిస్తున్న ఆశావాహులలో ఆశలు చిగురించాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రిజర్వేషన్లను ఖరారు చేసి వాటికి అనుగుణంగా అభ్యర్థుల పేర్లతో ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసి మూడు నెలలు గడుస్తున్న ఒక అడుగు ముందుకు పడటం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నియోజకవర్గ స్థాయి పదవి కావడంతో ద్వితీయ శ్రేణి కూటమి నేతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఛైర్మన్ పదవుల రిజర్వేషన్ ఖరారు కాకపోవడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది, కూటమిప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్న జిల్లా మిగతా 8లో

# వేసవి దృష్ట్యా నీటిసమస్య రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్**

**రెండు మండలాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి : ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** పుత్తూరు, వడమాలపేట మండలాల అభివృద్ధికి సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. గురువారం ఉదయం పుత్తూరు పురపాలక సంఘం సమావేశ మందిరం నందు నగరి నియోజకవర్గం, పుత్తూరు, వడమాలపేట మండలాల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, సంబంధిత శాఖల జిల్లా మండల స్థాయి అధికారులతో కలిసి సమీక్షా సమావేశము నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మిగిలిన ప్రాంతాల కంటే వడమాలపేట, పుత్తూరు మునిసిపాలిటీ, మండలాలలో నందు నీటి సమస్య ఉందని దీనికి సంబందించి తీసుకోవాల్సిన చర్యలపై సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై మున్సిపాలిటీ, పంచాయితీ అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. రానున్న వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో ప్రతి హ్యాబిటేషన్, ప్రతి ఇంటికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశించుకున్న మేరకు ప్రతి రోజు 55 ఎల్‌పీసి నీరు అందించే విధంగా సంబందిత అధికారులు కార్యాచరణ చేసుకోవాలన్నారు. క్రాష్ ప్రోగ్రామ్ ద్వారా బోరు బావులకు మిగతా 2లో



# రెవెన్యూ సమస్యలు పరిష్కారంలో అలసత్వం వీడండి

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**కుప్పం, మేజర్‌న్యూస్:** రెవెన్యూ సమస్యల పరిష్కారంనకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



హెచ్చరించారు. గురువారం కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో కుప్పం నియోజకవర్గంనకు సంబంధించి కుప్పం, గుడిపల్లి రామకుప్పం, శాంతిపురం మండలాల తహసీల్దార్‌లు డీటీలు ఆర్‌ఐలు, వీఆర్‌ఓలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు, సిబ్బంది వారి పరిధిలో గల గ్రామాల వారీగా అందిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలన్నారు.రెవిన్యూ సమస్యల పరిష్కారం నిమిత్తం మిగతా 2లో



# నగర పాలక సంస్థ ఆదాయానికి గండి

(మొదటిపేజీ తరువాయి)

అతగాడు నగరపాలక సంస్థకు బకాయి రూపంలో సుమారు ఆరు లక్షల వరకు బకాయి ఉన్నట్లు గుర్తించి అతనికి నోటీసులను అందించారు ఆ నోటీసులకు అతగాడు అదరక బెదరక పోవడంతో ఇక చట్ట ప్రకారం నగరపాలక సంస్థకు చెందిన గుర్రప్ప నాయుడు దుకాణ సముదాయంలోని అతని దుకాణాన్ని సీజ్ చేయడం జరిగింది. అయితే ఆ చోట నాయకుడు ఏమాత్రం నగరపాలక సంస్థ అధికారులు తీసుకున్న చర్యలకు భయపడకుండా సీజ్ చేసిన దుకాణాన్ని పగలగొట్టి దర్జాగా తన వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. ప్రభుత్వం మారిన అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకున్న ఈ వైసీపీకి చెందిన చోట నాయకుడు నగరపాలక సంస్థకు ఎగనామం పెట్టిన ఆరు లక్షలు కట్టకుండా దుకాణాన్ని నిర్వహిస్తున్న విషయాన్ని తెలుసుకున్న నగరపాలక సంస్థ అధికారులు వెంటనే చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్లో అతనిపై కేసును నమోదు చేసి అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. నగరపాలక సంస్థ అధికారులు కేసు ఇచ్చి రోజులు గడుస్తున్న సంబంధిత శాఖ అధికారులు కూడా నేటికీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం వెనక పలు విమర్శలకు తావిస్తోంది. ఈ వైసీపీకి చెందిన చోటా నాయకుడు ఎవరి అండతో ఈ కూటమి ప్రభుత్వ పాలనలో కూడా తన అరాచకాలను కొనసాగిస్తూ ప్రభుత్వా ధనాన్ని పంగనామాలు పెట్టి అనధికారకంగా దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు అనే విషయాన్ని కూటమి నాయకులే గ్రహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇతగాడి విషయాన్ని చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ దృష్టికి కూడా నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు తీసుకెళ్లనున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా నగరపాలకు సంస్థకు ఈ వైసీపీకి చెందిన నాయకుడు ఎగనామం పెట్టిన ఆరు లక్షల రూపాయలను ఎలా వసూలు చేస్తారు అతనిపై ఎలాంటి చర్యలు పోలీసు శాఖ తీసుకుంటుందో వేసి చూడవలసిన పరిస్థితి నెలకొంది.

## వైద్యం కోసం మేమున్నాం బృందం ఆర్థిక సహాయం

**తడ మేజర్‌న్యూస్:** ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి గోవర్ధన్ పాపకు కాన్సర్ విషయంగా మేమున్నాం సభ్యులు అందరూ ఏకమై తమవంతు బాధ్యతగా వితరణ అందజేశారు. ఇందులో అనేకమంది పూర్వ విద్యార్థులు, ఎన్నారైలు ఉండడం తోటి వారందరూ కూడా తమ వంతు బాధ్యతగా తమ కుటుంబ సభ్యుడులా భావించే మిత్రుని కోసం రూ90వేలని సభ్యులు అందించారు. సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో అనారోగ్య విషయంగా ఏదైనా ఒక ఆపద కష్టంలో ముందుండి స్పందించే మేమున్నాం బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్య విషయంగా అనేకమైన ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని అయితే తమ పరిధిలో తమ వంతు చేతనైన సాయం చేయడాని కి బాధ్యతగా భావించి ఆ కుటుంబం కు సేవ గా,బాధ్యతగా ఈ సాయం అందిస్తున్నామని మేమున్నాం సభ్యులు తెలిపారు. అనారోగ్య విషయంగా ఉన్న పరిస్థిలో తమ కుటుంబంగా భావించి సాయం చేస్తున్న ప్రతి దాతకు ఉస్మాన్ బాషా ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేమున్నాం వాలంటీర్లు ఉస్మాన్ బాషా,సురేష్ , వెంకటేశ్వర లాల్, అరుణకుమారి, శ్రీధర్ సాయిరాం, మలయ్య పాల్గొన్నారు.



## బాలికల హాస్టల్ విద్యార్థులను టీ సరఫరాకు పంపించిన సిబ్బంది

### బాలికలకు రక్షణ లేని ఎస్సీ హాస్టల్ సిబ్బంది

**బంగారుపాళ్యం, మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలోని తగ్గువారిపల్లిలో ఉన్న ప్రభుత్వ ఎస్సి బాలికల హాస్టల్‌లో ఉన్న విద్యార్థులను ప్రతిరోజు సిబ్బందికి టీ తీసుకురావడానికి రోడ్డుపైకి పంపిస్తున్న సంఘటన చోటుచేసుకుంది. ప్రతిరోజు సుమారు రాత్రి 7గంటల సమయంలో మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న టీఅంగడి వద్దకు పంపి టీ తెప్పించుకుంటున్నారు. చదువుకోవడానికి వచ్చిన పిల్లల దగ్గర ఇలాంటి చాకిరి చేయించడం ఎంత వరకు సమంజసం అని ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఇలా వారిని టీ తీసుకురావడానికి పంపిస్తుండం వచ్చు దారిలో బ్రాందీ షాపు ఉన్నది అక్కడ మందు బాబులు ఉంటారు. పిల్లలకు ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రజలు వాపోతున్నారు. ఇకమీదట అయిన పై అధికారులు చర్యలు తీసుకొని ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



## జూనియర్ కళాశాలలో అదనపు భవనం నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు

### స్థలాన్ని పరిశీలించిన జడ్పి సీఈవో రవికుమార్ నాయుడు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరంలో ఉన్న రాజా కుమార్ స్వామి రాజా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు భవనం నిర్మాణానికి రూ. 50లక్షలు మంజూరు చేయడంతో ఆ స్థలాన్ని జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు గురువారం పరిశీలించారు. గతంలో స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రారంభించడానికి వచ్చినప్పుడు కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప అదనపు భవనం కావాలని వినస్ పత్రం అందజేయడంతో, దీనిపై స్పందించిన ప్రభుత్వం 50 లక్షలు మంజూరు చేయడంతో ఆ స్థలాన్ని ఆయన పరిశీలించారు. నిధులు మంజూరు చేయడంపై శాసనసభ్యులకు ప్రిన్సిపాల్ స్వరూప కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ సిబ్బంది, ఎంపీడీవో చంద్రమౌళి, ఈవోపీఆర్డి నాగరత్నమ్మ, పాల్గొన్నారు.

# వేసవి దృష్ట్యా నీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)



ఫ్లషియింగ్ వంటి పనులు చేసుకోవాలని , అత్యవసర పరిస్థితులలో కొన్ని ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు ముందుగానే కార్యాచరణ చేసుకోవాలని అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 10 అంశాలలో భాగంగా కెనాల్స్ డీసిల్టింగ్, ఫార్మ్‌పాండ్స్, ట్రెంచింగ్, రైన్ హార్వెస్టింగ్‌కు సంబందించిన ఉపాధి హామీ పథకం కింద ఈ పనులను ఏపీఓలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ఎంపీడిఓలు కార్యాచరణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. మెటీరీయల్ వర్క్‌లో భాగంగా కాటల్ షెడ్లు, శ్మశాన వాటికల ఏర్పాటు, సిసి రోడ్లు, సిసి డ్రెయిన్స్ నిర్మాణాలకు సంబందించి చేయవలసిన పనులను గుర్తిస్తే గుర్తిస్తే వెంటనే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. పుత్తూరు పడమల పేట మండలాలలో ఉపాధి హామీ పథకం కింద పని దినాలను, వేతనాలను పెంచే దిశగా కృషి చేయాలన్నారు. పేదలకు పక్కా ఇళ్లు కట్టించేందుకు ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం కింద మండలాల్లో భూమిని గుర్తించే పనులను వేగవంతం చేయడం వలన అర్హులైన వారికి స్థలం మంజూరు చేయవచ్చన్నారు. ఇదివరకు జరిగిన రీసర్వే ప్రక్రియలో దొర్లిన తప్పులను సరిచేసి పక్కాగా రీ సర్వే పనులు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించే దిశగా నూతనంగా ప్రవేశపెట్టిన క్లస్టర్ విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సంబంధిత ఎంఈఓలు హెచ్‌ఎంలు దృష్టి పెట్టాలన్నారు. పుత్తూరు వడమల పేట మండలాలలో ధాన్య సేకరణ సంబంధించిన పనులను త్వరితగతన చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలాలలో ఉద్యాన శాఖ ద్వారా మామిడి పంట కాకుండా కొత్తగా ఇతర పంటలు వేసేందుకు పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నగరి ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వేసవిలో వడమాలపేట, పుత్తూరు మునిసిపాలిటీ, మండలాలలో నీటి ఎద్దడి సమస్యలు రాకుండా సంబందిత అధికారులు యాక్షన్‌ప్లాన్ తయారు చేసుకుని ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల్లో ఎక్కడ మట్టి రోడ్లు ఉండకూడదని, రోడ్డు సమస్య తో ప్రజలు ఇబ్బంది పడరాదని, పెండింగ్ రోడ్ల నిర్మాణం పనులు వేగవంతం చేసి పూర్తి చెయ్యాలని పంచాయతీ రాజ్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వంతస్థలం లేని వారికి అర్బన్ ప్రాంతంలో 2 సెంట్లు, రూరల్ ప్రాంతాలలో 3 సెంట్లు భూమిని ఇవ్వడానికి తగుచర్యలు చేస్తోందని దీనికి సంబందించి రేషన్ కార్డు ఉండి భూమి లేనివారిని గుర్తించాలని అలాగే ఎంత భూమి అవసరం ఉంది అనే అంశాల పై రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకుని హౌసింగ్ అధికారులకు ఇస్తే తద్వారా ఇల్లు లేని వారికి ప్రభుత్వ పథకాల ద్వారా స్థలం మంజూరు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ప్రజల దగ్గర నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కార దిశగా సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ మంజునాథ్ గౌడ్, ఎంపిడిఓలు రమేష్ బాబు, శేషగిరిరావు, జిల్లా పంచాయతీ అధికారిని సుశీలదేవి, ఇరిగేషన్ ఈఈ వేంకటేశ్వర ప్రసాద్, సంబంధిత మండలాల తాసిల్దార్‌లు, ఎఈలు, ఈఈలు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలు పరిష్కారంలో అలసత్వం వీడండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు రావడం జరుగుతుందని, అలా వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే విషయంలో చొరవ చూపాలన్నారు. నియమ నిబంధనలకు లోబడి సమస్యలను పరిష్కరించాలని, పరిష్కారం చేయడంలో కాలయాపన తగదని, ఇలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అందిన అర్జీలను నిర్దేశించిన సమయానికి పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహించి బాధ్యత రాహిత్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. వెబ్లాండ్ ప్యూరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించడం జరిగిందని వాటిని పరిరక్షించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే సరుకులను సకాలంలో కార్డుదారులకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో భాగంగా మండలాల వారీగా మ్యూటేషన్‌లు, ఎఫ్‌లైన్ పిటిషన్, ఆర్‌ఓఆర్ సంబంధిత అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, డిఎస్‌ఓ శంకరన్, కుప్పం, గుడిపల్లి, రామకుప్పం, శాంతిపురం తహసిల్దార్‌లు చిట్టిబాబు, సీతారాం, కౌలేష్, శివయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఎస్వీ హైస్కూల్‌లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు

### అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల ఎస్వి హై స్కూల్ లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో అత్యుత్తమ విద్యను అందిస్తున్నట్లు అదనపు ఈఓ వెంకయ్య చౌదరి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం తిరుమలలో టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి విద్యార్థులు మరియు అధ్యాపకులతో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదనపు ఈవో మాట్లాడుతూ చాలా కాలం తర్వాత ఇలాంటి కార్యక్రమానికి హాజరు కావడం తనకు చాలా సంతోషంగా ఉందని, ఇది తన పాఠశాల, కళాశాల రోజులను గుర్తుకు తెచ్చిందన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడం, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందన్నారు. దేశానికి మంచి పౌరులను అందించడానికి చదువుతో పాటు, ఉన్నత విలువలను బోధించాలని అధ్యాపకులకు సూచించారు. శ్రీవారి పాదాల చెంత టీటీడీ పాఠశాలలో చదువుకుంటున్న మీరందరూ ఎంతో అదృష్టవంతులు అని ఆయన చెప్పారు. పాఠశాల ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్ని విద్యార్థులు తమలో నైపుణ్యం వెలికి తీసే వివిధ కళల్లో, క్రీడల కొరకు వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. తరువాత అదనపు ఈఓ వివిధ పోటీ పరీక్షలు, క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, అకడమిక్ ఇన్‌చార్జ్ రంగలక్ష్మి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సురేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## ఆదిశంకరలో ఎంటెక్ విద్యార్థి ఆత్మహత్య

**గూడూరు, మేజర్‌న్యూస్:** ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఎంటెక్ విద్యార్థి సాయి(22) ఆత్మహత్య సంచలనం కలిగించింది. గురువారం మనుబోలుకు చెందిన సాయి తండ్రితో కలసి కాలేజికి వచ్చినట్లు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. కుమారుడు నాలుగు రోజులుగా అన్యమనస్కంగా ఉండడంపై కుమారుడు చదువుతున్న విభాగంగ హెచ్ఓడితో మాట్లాడుతున్న సమయంలో అకస్మాత్తుగా సాయి పైఅంతస్తు నుంచి కిందకి దూకేసినట్లు



తెలిపారు. దీంతో ఒక్కసారిగా కాలేజిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తండ్రి అక్కడే కుమారుడు విషయం హెచ్ఓడితో మాట్లాతున్న సమయంలో హఠాత్పరిమాణంతో నిశ్చేష్టుడై పోయినట్లు తెల్సింది. వెంటనే అక్కడ నుంచి ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్‌లు నిర్ధాచించినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుట్టన్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

## క్రిస్ సిటీ వద్ద పరిహారం కోసం ఆందోళన

**గూడూరు, మేజర్‌న్యూస్:** తమ్మినటప్నం వద్ద నిర్మాణంలో ఉన్న క్రిస్‌సిటీ భూ సేకరణలో



నిర్వాసితులు జాయింట్ కలెక్టర్‌ను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. గురువారం మధ్యాహ్నం లింగవరం గ్రామం వద్ద భూములు కోల్పోతున్న బాధితులు పరిహారం కోసం ఆందోళన చేశారు. దీంతో కొద్ది సేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు పోలీసు బలగాలను సమాయిత్తం చేశారు. అయితే చివరకు ఆందోళన చేస్తున్న బాధితులకు అధికారులు సర్ది చెప్పడంతో ఆందోళన మిరమించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, తహసిల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ కళాశాలకు కంప్యూటర్‌లు బహుకరణ

**గూడూరు, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలకు డిఎండబ్యు పరిశ్రమ సిఎస్ఆర్ నిధులతో అందించిన కంప్యూటర్‌లను ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అందచేశారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎస్ఆర్ నిధులు రూ.3లక్షలతో 10 కంప్యూటర్‌లను ఎస్‌కెఆర్ ప్రభుత్వ



జూనియర్ కాలేజ్ యాజమాన్యంకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశ్రామికసంస్థలు ఈ విధంగా ప్రభుత్వ కళాశాలలో కౌలిక వసతుల కల్పనకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అంతకు ముందు పరిశ్ర ప్రతినిధులు ఎంఎల్ఏను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులతోపాటు తెలుగుదేశం నాయకులు పులిమి శ్రీనివాసులు, గుండాల లీలావతి, పరిశ్రమ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోటరీచే హరిప్రసాద్‌కు సత్కారం

**గూడూరు, మేజర్‌న్యూస్:** యస్.వి.యూనివర్సిటి క్షయ వ్యాధిని అరికట్టడంలో విశేష కృషి చేసిన రోటేరియన్ డాక్టర్ నారు హరి ప్రసాద్‌కు అవార్డు బహుకరించిన సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. రోటరీ అధ్యక్షులు




శ్రీధర్ రెడ్డి ప్రసంగిస్తూ, డాక్టర్ హరిప్రసాద్ సేవలను కోనియాడి అభినందనలు తెలిపారు, తదుపరి మేజర్ డోనార్ డాక్టర్ జనార్ధన్ రెడ్డి, మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, డాక్టర్ మహేంద్ర, ఇన్నర్ వీల్ అధ్యక్షులు డాక్టర్ తనూజ, రోటేరియన్ డాక్టర్ రాజేంద్ర కుమార్, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ బి. దశరథరామిరెడ్డి, రోటేరియన్స్, ఇన్నర్ వీల్ సభ్యులు అందరు డాక్టర్ హరిప్రసాద్ సేవలను కోనియాడి అభినందనలు తెలిపారు. తదుపరి డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ క్షయ వ్యాధికి వైద్యం అందుబాటులోకి వందశాతం నయమౌతుందని తెలిపారు. ఈ అవార్డుతో తమ బాధ్యత మరింతగా పెరిగిందని మా శ్రాయశక్తులా టీబీ నిర్మూలన కోసం ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. అందరికీ ధన్యవాదాలు తెలిపారు. చివరగా రోటరీ కార్యదర్శి జి.జి.నాయుడు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో రోటేరియన్స్, ఇన్నర్ వీల్ సభ్యులు, డాక్టర్ అభిమానులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరంలో వెలసిన రుక్మిణిసత్యభామ సమేత వేణు గోపాల్ స్వామి ఆలయం సంతాన ప్రదాత ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజులు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయఅధికారి సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయంలో నవమి ప్రత్యేక పూజలు, సాయంత్రం తిరుచివాహనపై కోదండ రామస్వామి ఊరేగింపు, శనివారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు రాత్రికి స్వామివారు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతారు. ఆదివారం ఉదయం అభిషేకం ప్రత్యేక పూజలు స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగుతారు. రాత్రికి స్వామివారికి కల్యాణోత్సవం, రాత్రికి సర్వభూపాల వాహనంపై ఉత్సవ మూర్తులు ఊరేగింపు నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆలయ చుట్టూ విద్యుత్ దీపాలకన ఏర్పాటు చేశారు.

## ఇటుక బట్టీలపై జేసీకి ఫిర్యాదు

**కోట, మేజర్‌న్యూస్:** కోట మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా వెలసి ఉన్న ఇటుకల బట్టీలపై వెంకన్నపాలెం గ్రామస్తులు తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన జేపీ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఫిర్యాదు దారులు మాట్లాడుతూ తిమ్మనాడుపాలెం, వెంకన్నపాలెం, రంగన్న గుంట గ్రామల్లో గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ ఇటుకల బట్టీలు విచ్చలవిడిగా వెలసి ఉన్నాయన్నారు. ఎటువంటి అనుమతులులేని ఈ ఇటుక పరిశ్రమలు పాఠశాల సమీపంలో, చర్చి ఆనుకొని, దేవాలయాలకు దగ్గరగా, నివాస గృహాలకు దగ్గరగా, ప్రధాన ఆర్ అండ్ బి రోడ్డు పక్కన విచ్చలవిడిగా ఏర్పాటు చేసి ఉన్నాయన్నారు. ఈ ఇటుక బట్టి నుంచి వచ్చే దుమ్ము ధూళి పొగ, విషవాయువుల వల్ల గ్రామంలోని పిల్లలు, ముసలివారు, తీవ్ర శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో కూడా గ్రామంలోని



వృద్ధులు ముసలివారు హాస్పిటల్లో చేరడం జరిగిందన్నారు. జనాభాషాలకు, పంట పొలాలకు దగ్గరగా ఉండడంతో పంటలో కూడా దిగుబడి తగ్గిపోతుందన్నారు. తిమ్మ నాయుడుపాలెంలో ఉన్న ఇటుక పరిశ్రమలకు పంచాయతీ నుంచి, రెవిన్యూ నుంచి, పొల్యూషన్ నుంచి ఇటువంటి అనుమతులు లేవన్నారు, పొలాలకు వాడవలసిన విద్యుత్ కనెక్షన్లను పరిశ్రమలకు వినియోగించుకొని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఇటుక పరిశ్రమలపై గతంలో అనేక పర్యాయములు వార్తా కథనాలు వచ్చిన ఏ ఒక్క అధికారి కూడా స్పందించకుండా, ఇటుక పరిశ్రమలతో లాలూచీ పడుతున్నారన్నారు. అధికారులు ఇటిక పరిశ్రమలతో లాలుచిపడి ప్రభుత్వానికి పంచాయతీలకు రావలసిన పన్నులు కూడా కట్టించలేకపోతున్నారన్నారు. ఇటుక పరిశ్రమలు కావలసిన మట్టిని విదేయొచ్చుగా పట్ట పగలే అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న, అధికారులకు ఫిర్యాదులు వెల్లిన అది ఇల్లీగల్ బిజినెస్ మేము ఏమీ చేయలమంటూ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారన్నారు. అధికారులు ఇటుక బట్టీల ఇల్లీగల్ బిజినెస్‌పై ఉక్కుపాదం మోపాల్సింది పోయి వాళ్లకి సాగిలపడటం వెనుక మర్మమేంటన్నారు.

## ఎన్‌బికేఆర్‌లో ఇన్స్పిరాన్-2025 సాంకేతిక సదస్సు

**కోట, మేజర్‌న్యూస్:** కోట మండలం విద్యానగర్ లోని ఎన్.బి.కే.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్స్పిరాన్ – 2025 సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని 12 ఇంజనీరింగ్ కళాశాలల నుండి 85 మంది విద్యార్థులు హాజరు అయినారు అని కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ ఐ.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమమునకు కళాశాల సంచాలకులు డాక్టర్ వి.విజయ కుమార్ రెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసారు. మొదటిగా సంచాలకులు, ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్. సురేష్ రెడ్డి, అధ్యాపకులు జ్యోతి ప్రజ్వలన




చేసి కార్యక్రమమును ప్రారంభించారు. ఈ కార్యక్రమములో భాగంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రజంటేషన్ మరియు పోస్టర్ ప్రజంటేషన్ల పోటిలలో వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొని, బహుమతులు, ప్రశంస పత్రాలను కళాశాల సంచాలకులు చేతుల మీదుగా అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి సాంకేతిక సదస్సు ద్వారా విద్యార్థులలో నైపుణ్యత మిరుగుపడుతుంది అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు కళాశాలలో ప్రతి సంవత్సరం జరపడం ఆనవాయతీగా వస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఈ విభాగాధిపతి, కన్వీనర్, అధ్యాపకులు, విద్యార్థులు పల్గొన్నారు.

## స్థానికంపై వైయస్సార్సీపీ గురి.. మండల కమిటీల ఏర్పాటుపై కసరత్తు

### దువ్వూరు శేషురెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ మెరుగ మురళీధర్

**చిట్టమూరు మేజర్‌న్యూస్:** అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో 11 స్థానాలకే పరిమితమైన వైఎస్ఆర్సీపీ గూడూరు నియోజకవర్గంలోని చిట్టమూరులో తన బలం ఏమాత్రం తగ్గలేదని నిరూపించుకుని సత్తా చాటింది. మురళీధర్ గూడూరులో ఓటమి పాలైనా ఏమాత్రం నిరాశ చెందకుండా రెట్టించిన ఉత్సాహంతో వైయస్సార్సీపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు అడుగులు వేస్తున్నారు.పార్టీ కార్యక్రమాలను, తెలుగుదేశం ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి మరింతగా తీసుకు వెళ్లి పార్టీని బలోపేతం చేయాలన్న సంకల్పంతో కమిటీల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. ఆమేరకు గురువారం వైఎస్ఆర్సీపీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి కస్తూరి రెడ్డి,గూడూరు నియోజకవర్గ కల్చరల్ వింగ్ అధ్యక్షులు వాకాటి అష్విన్ రెడ్డిలతో కలసి చిట్టమూరు మండలంలోని పలువురు నాయకులను కలిశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా రైతు సలహా సంఘం మాజీ సభ్యులు, వైయస్సార్సీపి సీనియర్ నాయకులు దువ్వూరు శేషురెడ్డిని కలిసి, మండల స్థాయి పదవుల భర్తీపై చర్చలు జరిపారు. సానుకూలంగా స్పందించిన శేషురెడ్డి పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేయనున్నట్లు తెలిపారన్నారు. చిట్టమూరు మండలంలో బలం తగ్గని వైయస్సార్సీపి స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక దృష్టిని సారించింది.పార్టీని మరింత బలోపేతం దిశగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకతను పసిగట్టి స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విజయాలకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. ప్రాధాన్యత క్రమంలో పదవులు కట్టబెట్టేందుకు పావులు కదుపుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా, పార్టీ పటిష్టత ధ్యేయంగా మండల స్థాయి పదవులపై కసరత్తు చేస్తున్న పార్టీపై తరగని అభిమానం,చెక్కు చెదరని విశ్వాసంతో స్థానిక నాయకులు సానుకూలంగా స్పందించి, సహకరిస్తుండంపై మేరుగ మురళీధర్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామన్న ఎమ్మెల్సీ వైయస్సార్సీపీ తిరుగులేని శక్తిగా మారనుందన్నారు.



# టిడిఆర్ బాండ్ల జారీకి నేడు స్పెషల్ డ్రైవ్

**- కమిషనర్ ఎన్.మౌర్య**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** టీడీఆర్ బాండ్ల జారీ కోసం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎన్.మౌర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో భాగంగా స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లను త్వరితగతిన జారీ చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ లో నిర్వహిస్తారని తెలిపారు. ఈ డ్రైవ్ నందు టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొని, టీడీఆర్ బాండ్ల కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేయించడం, ఇతర సమస్యలు పరిష్కరించడం వంటివి చేస్తారని తెలిపారు. ముఖ్యంగా వాలిడేషన్ చేయించుకునే వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని తెలిపారు, ఆన్లైన్ ఎండార్స్మెంట్ ఇచ్చిన వారు, షార్ట్ ఫాల్ ఇచ్చిన వారు రావాలని తెలిపారు. టీడీఆర్ బాండ్లు పొందాల్సిన వారు స్పెషల్ డ్రైవ్ కు తగిన డాక్యుమెంట్లతో హాజరుకావాలని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# దేవాలయాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయండి

**- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**




**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం నియోజకవర్గంలో ఎంపిక చేసిన దేవాలయాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను ఏప్రిల్ 15 రోజుల్లో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ దేవాదాయ శాఖ ఎస్ఈని ఆదేశించారు. గురువారం కుప్పం హార్టికల్చర్ హబ్ లో కుప్పం నియోజక వర్గంలో ఎంపిక చేయబడ్డ దేవాలయాల అభివృద్ధికి సంబంధించి దేవాదాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్, కడ పిడి వికాస్ మర్మత్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజక వర్గంలో 11 దేవాలయాల అభివృద్ధి లో భాగంగా కుప్పం, పరమ సముద్రం లో గల బేతర్ల స్వామి దేవాలయానికి రూ.2.66 కోట్ల తో, నూలికుంట లో కదిరి నరసింహ స్వామి దేవాలయానికి రూ.1.35 కోట్ల తో,శాంతిపురం మండలం రాళ్ళ బూదుగురు కోదండ రామస్వామి ఆలయానికి రూ. 7.85 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవడం జరిగిందని తెలిపారు. ఇవి కాకుండా మిగిలిన 8 దేవస్థానాలు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను ఏప్రిల్ 15 వ తేదీ లోపు సిద్ధం చేయాలని దేవాదాయ శాఖ ఎస్ ఈ సతీష్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ డిఈ జనార్ధన్ రావు, జిల్లా ఎండోన్మెంట్ అధికారి చిట్టెమ్మ, ఇన్‌స్పెక్టర్ శశి కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అలిపిరి టోల్ గేట్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు






**తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్:** తిరుపతి టోల్‌గేట్‌లో భక్తులు తిరుమల చేరుకునేందుకు ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలిపిరి టోల్ గేట్ వద్ద విఐపి వాహనాలు, సామాన్యప్రజల కార్లు వెళ్ళు మార్గంలతో పాటు ద్విచక్ర వాహనాలు వెళ్ళు మార్గాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. తిరుమలకు వెళుతున్న ద్విచక్ర వాహనాలు, కార్లులను సిబ్బంది చెకింగ్ చేస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు వెళ్ళుతున్న సమయంలో స్కానింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. అదేవిధంగా తిరుమలకు వస్తున్న భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులు వస్తున్న స్కానింగ్ ను నిశ్చింతగా పరిశీలించి.. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలిపిరి వద్ద ఉన్న సిసి కెమెరాను పరిశీలించి.. సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కే రవి మనోహర్ ఆచారి అదనపు ఎస్పీ శాంతి భద్రతలు, సదాలక్ష్మి వి ఎస్ ఓ, రమేష్ కృష్ణన్ ఏవి అండ్ ఎస్ ఓ, పురుషోత్తం విఐ, రామకృష్ణ ఎస్ విఎఫ్ ఆర్ ఐ, శ్రీలత డిఎస్పి మహిళ తిరుపతి టౌన్, సుబ్రహ్మణ్యం సి. ఐ.డి.సి.ఆర్. బి, సాధిక్ ఆలి సీ.ఐ. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఎన్డీఏ ప్రభుత్వం నెరవేరుస్తుంది: ఎమ్మెల్యే ఆరణి

**తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్:** తిరుపతి-పళని ఆధ్యాత్మిక క్షేత్రాల మధ్య కొత్తగా రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం సాయంత్రం మంగళగిరి క్యాంపు కార్యాలయంలోప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో స్థాని కులకు శ్రీవారి దర్శనం కల్పిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని ఆరణి శ్రీనివాసులు చెప్పారు. అలాగే ప్రముఖ శైవ క్షేత్రమైన పళని నుంచి తిరుపతికి బస్సు సర్వీసులు ప్రారంభిస్తామని తమిళ భక్తులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీని ప్రభుత్వం



నెరవేర్చిందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీ లు నెరవేరుస్తుండటంతో స్థానికులతో పాటు తమిళనాడు భక్తులు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేర్చి ఇది మంచి ప్రభుత్వని ప్రజల చేత శెభాష్ అనిపించుకుంటోందని ఆయన తెలిపారు.

# శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం : అడిషనల్ ఎస్పీ



**చిత్తూరు క్రైమ్ మేజర్ న్యూస్:** శక్తి యాప్ పై మహిళా విద్యార్థులకు, మహిళలకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ రాజశేఖర్ తెలిపారు. జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు, ఆదేశాల మేరకు శక్తి టీం నోడల్ అధికారి అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఇంచార్జ్ అడ్మిన్ ఎస్. ఆర్.రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో గురువారం విజయం డిగ్రీ కాలేజ్ ఎస్ వి సెట్ ఇంజనీరింగ్ కాలేజీ నందు మహిళా డిఎస్పీ విజయశేఖర్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అయన మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అత్యవసర సమయంలో ఒకే ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేయగానే సమీప పోలీస్ స్టేషన్‌కు సమా చారం చేరుతుందని, ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం చాలా అవసరమని, కాలేజీ లలో శక్తి వారియర్ గ్రూప్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో మహిళా ఎస్.ఐ నాగ సౌజన్య, కాలేజి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి తిరుపతి జిల్లాకు రాక

తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్: నేడు రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి జిల్లాలో పర్యటించనున్నారనీ జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకున్న అనంతరం సాయంత్రం ఆరు గంటలకు గూడూరు లోని ఆది శంకర ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల నందు జరిగే సిల్వర్ జూబ్లీ వేడుకలలో మహర్షి మహేష్ యోగి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 8.15 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకొని హైదరాబాద్ నకు వెళ్ళనున్నారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# చుక్కల నిడిగిల్లు గ్రామస్తులు రాకుండా రోడ్డు తవ్వకం

**శ్రీకాళహస్తి మేజర్‌న్యూస్ :** శ్రీ కాళహస్తి మండలం చుక్కల నిడిగిల్లు గ్రామస్తులకు రోడ్డు లేకుండా తెలుగుదేశం పార్టీ సర్పంచి కను సన్నల్లో రోడ్డు తవ్వకం జరిగింది.

155/3 సర్వే నెంబర్లు గల12 ఎకరాలు సురుతు వారి గుంట చెరువు శ్రీకాళహస్తి మండలం చుక్కలు నిడిగల్లు గ్రామానికి సంబంధించినది. ఆ చెరువులు ఉపాధి పనులు చేయడానికి దిగిన చుక్కల నిడిగల్లు గ్రామం ఎస్సీ ఎస్టీ ఉపాధి కూలీలను టిఎంవి కండ్రిగ తెలుగుదేశం పార్టీ సర్పంచి అడ్డుకొని ఆపాలని చెప్పాడు. ఇది మా ఊరి చెరువు మేము ఉపాధి పనులు చేసుకుంటే మీకేమిటి అని వారు ప్రశ్నించారు. ఈ చెరువు మా అక్రమంలో ఉంది. మీరు ఉపాధి పనులు చేసేందుకు వీలులేదని అడ్డుకున్నారు. మా చెరువులో మేము ఉపాధి పనులు చేసుకుంటే మీకేందని వారు ప్రశ్నించారు. అయితే ఈ రోడ్డు మాది మా ఊరి మీద మీరు వెళ్తున్నారు కాబట్టి మేము రోడ్డు తొలగి స్తామని మీరు ఎలా వెళతారో చూస్తామని బెదిరింపులకు దిగి రోడ్డును అడ్డంగా తొలగించారు. చుక్కల నిడిగల్లు గ్రామస్తులు శ్రీకాళహస్తి పట్టణంలోకి రాకుండా రోడ్లు తొలగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్త మయ్యాయి. రోడ్డును తొలగిస్తే ఎంపీడీవో ఇతర అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. గ్రామలు మధ్య గొడవలకు దారి తీసే అవకాశం ఉన్నది దీనిపైన అధికారులు పాలకుల స్పందించు కుంటే చాలా పెద్ద సమస్యలకు దారితీస్తుంది. చుక్కలు నిడిగల్లు గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు టీఎంవీ కండ్రిగ తెలుగుదేశం నాయకుడి ఆధ్వర్యంలో రోడ్డు తవ్వుతున్న అక్కడికి వచ్చి వారిని అడ్డుకుంటే తమ అక్రమ ఇసుక రవాణా నాకు అడ్డుపడతారని భయపడి అటువైపు కనెత్తి చూడలేదు.గ్రామాల్లో గొడవలు చూడాల్సిన ప్రజా ప్రతినిధులు. అధికారులు అటువైపు చూడక పోవడం బాధాకరంగా ఉందని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధించండి : కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** తిరుపతి నగరంలోని ఖాళీ స్థలాలలో చెత్త వేసినా, శుభ్రంగా ఉంచుకోకపోయినా జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం 14, 17 వార్డుల్లో పారిశుద్ధ్య పనులను హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు చెత్త తో నిండి ఉన్నాయన్నారు. దీని వలన ప్రక్కన ఇండ్ల వాళ్ళు ఇబ్బంది పడడమే కాకుండా అపరిశుభ్రంగా తయారు అవుతోందని అన్నారు. ఆ స్థలం వారిని గుర్తించి జరిమానాలు విధించి శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాలువలు లేని ప్రాంతాల్లో కాలువల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరు ఇస్తే కలిగే లాభాలను పద్మావతి పార్కులో ప్రజలకు వివరించారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో తిరుపతి ని మొదటి స్థానంలో ఉంచేలా అందరూ సహకరించాలని ప్రజలను కోరారు. ప్రతి వీధిలోకి చెత్త వాహనం ఒక నిర్దిష్ట సమయంలో వెళ్లేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ. మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.





## పలమనేరు కుప్పం గంగమ్మ గుడి చైర్మన్లుగా ఎంపిక



**పలమనేరు మేజర్ న్యూస్:** కుప్పం పట్టణానికి చెందిన బి కే యం రవిచంద్రబాబు ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయ చైర్మన్‌గా ఎన్నిక కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన కుప్పం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గత నాలుగు సంవత్సరాలుగా నిరుపేద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా పలమనేరు తిరుపతి గంగమ్మ దేవస్థానం చైర్మన్ గా కె. కోటీశ్వరులు,ఎంపిక కావడం జరిగిందన్నారు. ఇందులో కోటికి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. వీరిద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం జరిగిందన్నారు. కోటీశ్వరులు,బలిజ అభ్యుదయ సేవా సంఘానికి ఎనలేని సేవ చేయడం జరిగిందన్నారు. వీరిద్దరి ఎంపిక రావడం వలన కుప్పం పట్టణానికి చెందిన డాక్టర్ ఎం. ప్రభాకర్ శ్రీ సద్గురు యోగి నారాయణే, బలిజ సేవా సంఘం ట్రస్ట్ అధ్యక్షులు, పలమనేరు బాస్ అధ్యక్షులు వీ.ఎం రూపేష్, వారిద్దరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## 6న జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్ :** ఈ నెల 6వ తేదీన ఆదివారం స్థానిక శ్రీదేవి కాంప్లెక్స్ ఒకటవ అంతస్తున గల టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ, బాక్సింగ్ డెవలప్మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి తరఫున జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు జరుగునని .ఆంధ్రప్రదేశ్ అమ్మెచూర్ బాక్సింగ్ అసోసియేషన్ తిరుపతి జిల్లా ఇన్చార్జి, కమిటీ మెంబర్ పి.గీతా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీలకు క్యాబ్, కెడెట్, జూనియర్, సీనియర్ విభాగములలో జరుగును. ఆసక్తి గల క్రీడాకారులు వారి వారి సొంత పరికరాలు, ఆధార్ కార్డుతో సహా వారి వివరాలను ఈనెల 4,5 తేదీలలో నమోదు చేసుకోవాలని, నమోదు లేని వారికి అవకాశం ఉండదని తెలిపారు. ఈ పోటీలందు గెలి చిన బాలబాలికలు ఈనెల 12 మరియు 13న విశాఖపట్నం నందు జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. మరిన్ని వివరాలకు 95731 44232, 70135 91635 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

## బదిలీ అయిన కానిస్టేబుల్ కు సన్మానం



**పెద్దపంజాణి, మేజర్ న్యూస్:** పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ కు స్థానిక పెద్దపంజాణి పోలీస్ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.గత నాలుగు సంవత్సరములుగా పెద్దపంజాణి పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ఆర్ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి సదుం పోలీస్ స్టేషన్కు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో గురువారం స్థానిక పెద్దపంజాణి ఎస్సై ధనుంజయ రెడ్డి తన సిబ్బందితో కలసి బదిలీపై వెళ్తున్న వెంకటేష్ రెడ్డి కానిస్టేబుల్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వం రీసర్వే ప్రాజెక్టు కార్యక్రమం




పలమనేరు మేజర్ న్యూస్: రూరల్ మండలంలోని చెత్త పెంట గ్రామంలో గురువారం ఉదయం ప్రభుత్వము రీ సర్వే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే గురించి మండల తహాశీల్దార్ ఇన్బనాదం ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా బ్యానర్ ను వీధులలో ప్రదర్శించారు. అనంతరం మండల సర్వేయేర్ రమణారెడ్డి విధివిధానాలు గురించి రైతులకు తెలియజేశారు. అనంతరం మండల రైతు విభాగ అధ్యక్షులు జగదీష్ నాయుడు కూడా రైతులకు కొన్ని సూచనలు సలహాలు అందించారు. అధికారులు వచ్చినప్పుడు వారి వారి భూముల దగ్గర ఉండి అధికారులకు మీ యొక్క సమస్యలను చెప్పి సరిచేసుకోవాలి అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ ఇన్బనాదం ,మండల సర్వే రమణారెడ్డి,వి ఆర్ ఓ వినయ్,విలేజ్ సర్వే రామచంద్ర, పంచాయితి సెక్రెటరీ విజయ, జగదీష్ నాయుడు,మూర్తి నాయుడు,కార్తిక్, గౌతమ్, చెత్త పెంట గుణ, పాండు, మండిపేట హరి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల ట్రాక్టర్ బోల్తా

### 20 మందికి గాయాలు



**పిచ్చాటూరు మేజర్‌న్యూస్:** నగరి నియోజక వర్గం విజయపురం మండలం పన్నూరు సమీపాన ట్రాక్టర్ బోల్తా పడి 20 మందికి గాయాలు కాగా ముగ్గురు పరిస్థితి విషమం గా ఉంది. విజయపురం మండలంలోని ఆమగుంట గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీలు ట్రాక్టర్లో పన్నూరు అడవికి పనిచేయడానికి వెళుతుండగా ట్రాక్టర్ టైర్ ఊడిపోవడంతో ట్రక్కు బోల్తా పడింది. దీంతో వీరికి గాయాలు కావడంతో మూడు ప్రభుత్వ అంబులెన్స్ ల ద్వారా నగరి ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఉపాధి హామీ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి అవసరమైన చర్యలు చేపట్టారు.వివరాలు తెలియాల్సి వుంది.

## ఎమ్మెల్సీ నాగబాబుతో శ్రీకాళహస్తి కొట్టే సాయి



**శ్రీకాళహస్తి అర్బన్ మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎమ్మెల్సీ కొణిదల నాగబాబుని విజయవాడలో నోవాల్టీ హెూటల్ లో జనసేన పార్టీ ఉమ్మడి తిరుపతి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి జనసేన పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జి చంద్రశేఖర్. తదితరులు పాల్గొన్నారు.

## వేలం పాటలో రూ.7.50 లక్షల ఆదాయం

**యాదమరి మేజర్‌న్యూస్:** యాదమరి సంత వేలం పాటలో రూ.7,50,000 ఆదాయం వచ్చినట్లు ఎంపీడీఓ వేణు తెలిపారు. గురువారం మండలంలోని చిన్నిరెడ్డిపల్లి క్రాస్ నందు గల చెత్త సేకరణ కేంద్రం వద్ద సంత నిర్వహణకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి పార్వతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమైన ఈ బహిరంగ వేలం పాటలో మొత్తం 11 మంది ఆశావహులు సంతలో రుసుములు వసూలు చేసుకునే గుత్త హక్కుకు పోటీ పడ్డారు.చివరగా చిన్నంపల్లికి చెందిన జార్జి ఒక సంవత్సర కాలానికి గాను రూ.7,50,000లకు సంత నిర్వహణను చేజిక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డి సుకుమార్ రెడ్డి,స్థానిక సర్పంచ్ ఝాన్సీ,ప్రజలు పాల్గొన్నారు.



## అమ్మపై తండ్రి వేధిస్తున్నాడని.. తండ్రితో కొడుకు ఘర్షణ పడగా తండ్రి మృతి



**ఎస్ఆర్‌పురం మేజర్‌న్యూస్:** కుటుంబంలో ఉన్న పెద్ద ఆమె భార్యను వేధిస్తుందటతో ఈ క్రమంలో కొడుకు కలగజేసుకుని వాదలాటకు దిగిన ఘటనలో తండ్రికి గాయాలయి ఊపిరి పోయిన సంఘటన ఎస్ ఆర్ పురం మండలం ఎగువ పాపిరెడ్డి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ హనుమంతప్ప వివరాల మేరకు ఎస్ ఆర్ పురం మండలం ఎగువ పాపిరెడ్డి గ్రామం లో శ్రీనివాసులు(60), మందిడి, తన భార్య పిల్లలతో కలిసి కాపురం ఉంటున్నాడు. ఈ క్రమంలో అతను తాగుడుకు బానిసై తన భార్యను నిరంతరం వేధించెవాడు. ఇది కొన్నాళ్ళుగా గమనించ సాగిన కుమారుడు నాగరాజు నిరంతరంగా భరించ సాగాడు. ఈ క్రమంలో గురువారం తను తండ్రికి, అమ్మ పై గొడవకు దిగాడు. ఈ వాదులాటలో శ్రీనివాసులకు గాయలై ప్రాణం విడిచాడని సీఐ వెల్లడించారు. ఈ ఘటన పై కేసు ధర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్ఐ సుమన్ తెలిపారు.

## పెన్షన్ సవరణను విరమించుకోవాలని విశ్రాంతి రైల్వే ఉద్యోగుల నిరసన

**రేణిగుంట మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి సవరణ బిల్లును మూ జువాని ఓటుతో పార్లమెంటులో ఆమోదింప చేయటానికి వ్యతిరేకిస్తూ గురువారం రేణిగుంట పట్టణ ప్రాంతంలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ వారి ఆదేశాల మేరకు ఈరోజు రేణిగుంట రైల్వే ఫన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గత నెల 25.వ తేదీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సవరణ బిల్లును మూ జువాని ఓటుతో పార్లమెంటులో ఆమోదింప చేయటాన్ని నిరసనగా రేణిగుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో



రేణిగుంట రైల్వే పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ను మార్పు చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లు ను గురించి చర్చించి తరువాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశమై నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం రేణిగుంట రైల్వే స్టేషన్ వద్ద మహాత్మా గాంధీ కస్తూరి విగ్రహాల ముందు సమావేశమైన తర్వాత తమ డిమాండ్లపై నిరసన ప్రదర్శన చేశారూ. కేంద్ర ప్రభుత్వం వెంటనే 8వ సిపిసి కింద అన్ని పెన్షనర్లు సమాన ప్రయోజనాలను పొందుతారని వ్రాతపూర్వక హామీ ఇవ్వాలని,పదవీ విరమణ తేదీల ఆధారంగా పెన్షనర్ల మధ్య భేదం చూపకూడదు అంటూ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల విధివిధానాలను మార్చిన బిల్లును రద్దు చేయాలని, కొత్తవారికి పాత వారికి ఒకే పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ ఎస్ హసన్ సాహెబ్, రేణిగుంట పట్టణ సర్పంచ్ ఆర్ నగేష్, బ్రాంచ్ కార్యదర్శి కుమార్, ఆఫీస్ బేరర్లు జి రాజేంద్ర ప్రసాద్ జి జయంత్ కుమార్, సెక్రటరి పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట శ్రీరామనవమి ఉత్సవాలకు 12 టన్నుల కూరగాయలు వితరణ



**పలమనేరు మేజర్ న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయమైన ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయానికి సీతారాముల కళ్యాణ ని తిలకించేందుకు వచ్చేభక్తులకు అన్నదాన వితరణకు బెంగళూరు కూరగాయల మార్కెట్ నుండి12 టన్నుల కూరగాయలను కాపుపల్లి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో కడప జిల్లా ఒంటిమిట్ట రామాలయ దేవస్థానంకు టీటీడీ అధికారులసూచన మేరకు పంపించడం జరిగిందన్నారు. పలమనేరు రూరల్ మండలం కాపుపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ రవీంద్రారెడ్డివివిధ రకాల కూరగాయలను టిటిడి వారి వాహనంలో తరలించారు.డాక్టర్ రవీంద్ర రెడ్డి మిత్ర బృందం మోహన్ రెడ్డి , సోమశేఖర్ నాయుడు, బాబు,శ్రీకాంత్ సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుడి మృతికి నివాళి

**చిత్తూరు కార్పొరేషన్ మేజర్ న్యూస్:** నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న కె.రామయ్య మృతికి నగర మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి. నరసింహ ప్రసాద్, ఎంహెచ్వో డా పి.లోకేష్ లు గురువారం నివాళులు అర్పించారు. ఐరాల మండలం మఠంపల్లి గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తరఫున మట్టి ఖర్చుల కింద రూ.15వేలు కుటుంబ సభ్యులకు అందించారు.



## రోడ్డు ప్రమాదం పై ఎమ్మెల్యే ఆరా



**చిత్తూరుఅర్బన్ మేజర్ న్యూస్:** చిత్తూరు - చెన్నై జాతీయ రహదారిపై చీలాపల్లి సిఎంసీ ఆసుపత్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆరా తీశారు. గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులను, వ్యక్తిగత సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు కుమారస్వామి, మోహన్ సత్వరం సంఘటనా స్థలాన్ని చేరుకొని పోలీసులతో సమన్వయం చేసుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరికీ మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు.

## ఖర్జూరంలో పురుగులు అని ప్రచురితమైన వార్తపై స్పందించిన అధికారులు



**బంగారుపాలెం మేజర్‌న్యూస్:** బంగారుపాలెంలోని గుండ్ల కట్టమంచి అంగన్వాడి కేంద్రంలో గర్భవతులు బాలింతలకు పౌష్టికాహారం క్రింద అందజేసిన ఎండు ఖర్జూరంలో పురుగులు అని నాణ్యత లేదని చర్యలు తీసుకోవాలని వార్తకు స్పందించిన అధికారులు సరఫరాదారిని పిలిచి నాణ్యతలేని సరుకులు సరఫరా చేయకండి అని ఆదేశించడం అయినది ముందుగా సరఫరా చేసినటువంటి అంగన్వాడీ కేంద్రంలో గల ఎండు ఖర్జూరం ప్యాకెట్లను సరఫరా చేసిన లబ్ధిదారులకు అందించిన ఎండు ఖర్జూరం ప్యాకెట్లు అన్నీ తిరిగి తీసుకొని సరఫరాదారునికే చేరవేసి నాణ్యమైన ఖర్జూర ప్యాకెట్లను మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించిన అధికారులు ఈ సమాచారాన్ని పై అధికారులకు కూడా తెలియజేయడమైనది.

# వెంకన్నపాలెం ఘర్భకండ్రిగ భూములను పరిశీలించిన జేసీ



**కోట, మేజర్‌న్యూస్:** మండలంలో వెంకన్నపాలెంలోని గర్భకండ్రిగ భూములను తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ గురువారం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి పరిశీలించారు. స్థానిక తాసిల్దార్ జె జె రావు నుంచి భూ సమస్య పూర్వాపరాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం రైతులతో పాటు కలిసి గర్భ కండ్రిగ భూములను పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ మంగళవారం గర్భ కండ్రిగ సమస్యను స్థానిక సర్పంచ్‌తో కలిసి తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఆ క్రమంలో వెంకన్నపాలెం గ్రామాన్ని సందర్శిం చడం జరిగిందన్నారు. గత పది సంవత్సరాలుగా గర్భకండ్రిగ భూములు కోట సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరుగు చున్నా, తుహసీల్దార్ కార్యాలయంలో మ్యూటేషన్లు జరగడంలేదని, కొత్తగా ఎవరికి పాస్ పుస్తకాలు చేయడం లేదని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. గర్భ కండ్రిగ భూములు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రోహిబిటెడ్ లిస్టులో (పిఓబి) కూడా లేవని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. గత పది సంవత్స రాలుగా ముటేషన్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులతో చెప్పడం జరిగిందన్నారు. రెవెన్యూ రికార్డులో వెంకన్నపాలెం గ్రామంలో 342.77 ఎకరాలు భూమి గర్భ కండ్రికగా నమోదు కాబడి ఉందని, రెవెన్యూ శాఖ నుంచి రైతులు వివరాలను సేకరించి త్వరలోనే గర్భ కండ్రిగ సమస్యకు ముగింపు పలుకుతామన్నారు.

**తిరుపతి జేసీ, ఎమ్మెల్యే పాశం సునీల్‌కు కృతజ్ఞతలు...** వెంకన్నపాలెం సర్పంచ్ కోకర్ల మధు యాదవ్ తిరుపతి జెసి శుభం బన్సల్, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కు వెంకన్నపాలెం గ్రామం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నా మని వెంకన్నపాలెం సర్పంచ్, టిడిపి నాయకులు మధు యాదవ్ పేర్కొన్నారు. మధుయాదవ్ మాట్లాడుతూ గత పది సంవత్స రాలుగా దీర్ఘకాలికంగా ఉన్న గర్భ కండ్రిక భూ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి పిమ్మట రెండు రోజుల్లోనే స్పందించిన జెసి సమస్యను పరిష్కరించేందుకు సంకల్పిం చడం హర్షించదగ్గ విషయమన్నారు. గురువారం గర్భకండ్రిగ సంబంధించిన వివరాలను జాయింట్ కలెక్టర్ గ్రౌండ్ లెవెల్‌లో కూలంకషంగా పరిశీలించి పది రోజుల్లోనే పరిశీలిస్తామని చెప్పడం జరిగిందన్నారు. గర్భ కండ్రిగ భూ సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే చూపించి చొరవ ప్రశంస నీయమన్నారు. గ్రామస్తులు తరపున జాయింట్ కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో కోట మండలతాసిల్దార్ జె జె రావు, మండల సర్వేయర్ గోపి నాథ్ రెడ్డి, ఆర్ఐ మధులత, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్ రావు, వీఆర్వో కృష్ణయ్య, విలేజ్ సర్వేయర్ సుబ్రహ్మణ్యం, వెంకన్నపాలెం గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీకారం

**చిన్నగొట్టిగల్లు మండలానికి పశువులు నీళ్లు తాగడానికి 83 నీటి తొట్లు మంజూరు**

**రంగన్నగారి గడ్డ గ్రామంలోనీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే**



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఎండ తీవ్రత దృష్ట్యా మూగజీవా లను తాగు అందించాలన్న ఉద్దేశ్యం తో రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ వ్యాప్తంగా 457నీటి తొట్టెలను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. దానిలో భాగంగా చిన్నగొట్టుగల్లు మండలానికి సుమారు 83నీటి తొట్టె లను మంజూరు చేసిన ఎమ్మెల్యే పులి వర్తి నాని దానిలో భాగంగా రఘు నన్న గారిగడ్డ గ్రామంలో నీటి తొట్టెకు ఎమ్మెల్యే పులివర్తి నాని భూమి పూజ చేసి ప్రారంభించారు. పులివర్తి నాని మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పాడి ఆవులకు నీరు త్రాగడానికి గ్రామాలలో నీటి తోట్లు లేక చాలా ఇబ్బంది అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి దృష్టికితీసుకెళ్తే సానుకూలంగా స్పందించిన చంద్రగిరి నియోజవర్గానికి 457 నీటితొట్లు మంజూరు చేస్తున్న ట్లు హామీ ఇచ్చారు. ఎన్.ఆర్జీ.ఎస్ నిధులతో నీటితొట్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఒక్కొక్క నీటి తొట్టెకు రూ.38వేలను మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పార్టీలకతీతంగా ఆయా పంచాయతీలలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పాడి ఆవులకోసం నీటి తొట్లు నిర్మిస్తున్నట్లు మండల ప్రజలకు ఎమ్మెల్యే తెలి పారు. ఈ కార్యక్రమం లో మండల స్థాయి అధి కారులు, కూటమి ప్రభు త్వం నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.



# వైభవంగా కోదండరాముని రథోత్సవం



(మొదటిపేజీ తరువాయి)

రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. రథం నాలుగు మాడ వీధుల్లో ఊరేగి యథాస్థానానికి చేరిన తరువాత ప్రబంధం, వేద శాత్తుమొర నిర్వహించి హారతి ఇచ్చారు. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మా నాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవం లో ముఖ్యంగా కలిగే తత్త్వ జ్ఞానమిదే. మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4 గంటల వరకు అర్చకులు తిరుమంజనం, ఆస్థానం నిర్వహించనున్నారు. రాత్రి 7 నుండి 8.30 గంటల వరకు అశ్వవాహన సేవ వేడుకగా జరగనుంది.వాహనసేవలో తిరుమలపెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ఏప్రిల్ 4న చక్రస్నానం...** కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు కపిలతీర్థంలో చక్రస్నానం వైభవంగా జరుగ నుంది.



# ఆశ.. నిరాశ ?



(మొదటిపేజీ తరువాయి)

స్థాయిలో నామినేటెడ్ పదవుల నియామకానికి సంబంధించి అడుగులు ముందుకు పడడం లేదు. ఇక మార్కెట్ చైర్మన్ పదవుల రిజర్వేషన్లు ఖరారు కపోవడంతో ఆ పదవులపై ఆశలు పెట్టు కున్న పలువురు ఆశవహులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నామినెటెడ్ పదవులపై దృష్టి సారించింది. ఇప్పటికే రెండు విడతల నామినేటెడ్ పదవులు భర్తీ చేయగా, తాజాగా మూడో విడత నామినేట్ పదవుల నియామకం ఉగాది రోజు ప్రకటిస్తారని సమాచారం అందగా. కష్ట కాలంలో పార్టీకోసం పనిచేసిన ద్వితీయ శ్రేణి నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వడం ద్వారా వారికి తగిన ప్రాధాన్యత కల్పించాలని కూటమి అగ్ర నేతలు భావిస్తున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్ తమకు అనుకూలంగా వస్తుందా లేదా అనే ఉత్కంఠత ఆశా వాహులలో నెలకొంది. నియోజక వర్గ స్థాయిలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ లు కీలకమైనవి. ఈ కమిటీల చైర్మన్ పదవులను ఇచ్చేందుకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు మార్గదర్శకా లను కూడా జారీచేశారు. వాటికి అనుగు ణంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్ ఖరారు చేసి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపాలని కోరారు. సామా జిక వర్గాలకు కేటాయించడంతో పాటు వాటిలో మహిళలకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నారు. జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా వాటి పరిధిలోని ఎమ్మెల్యేల సూచనలు, సలహాలను కూడా తీసుకుని రిజర్వేషన్లు ఖరా రు చేసేందుకు ఆ శాఖ అధికారు లు కసరత్తు చేస్తున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌ల రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం సూచించి న మార్గదర్శకాలు ఆనుగుణంగా మార్కెటింగ్‌శాఖ అధికారులు ప్రతి పాదనలను సిద్ధం చేశారు. చైర్మన్ల రిజర్వేషన్లపై మార్కెటింగ్ అధి కారులు రూపొందించిన ప్రతి పాదనలను చర్చించి ఒక నిర్ణ యానికి రావాల్సి ఉంది. అయితే ఆ దిశగా అడుగులు పడకపోవ డంతో మార్కెట్ కమిటీ పదవులు ఆశిస్తున్న నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్ పదవులను వివిధ సామాజిక వర్గాలకు చెందిన బలమైన నాయకులు పోటీ పడుతున్నారు. దీంతో రిజర్వేషన్ల కేటాయింపు విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులకు తలనొప్పిగా మారింది. అలాగే బలమైన నాయకులకు చైర్మన్ పదవి రిజర్వేషన్లు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. దీంతో కమిటీ చైర్మన్ రిజర్వేషన్ కేటాయింపు కొంత జాప్యం జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది, అనంతరం రిజర్వేషన్ల కు అనుగుణంగా శాసనసభ్యులు సిఫార్సు మేరకు చైర్మన్, డైరెక్టర్ల సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నది. ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవులు, డైరెక్టర్ల రిజర్వేషన్ ఖరారు చేసి భర్తీ చేయాలని ఆశావాహు లు కోరుతున్నారు.

జనం కోసమే
శ్రీ దినపత్రిక సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

